ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 262
ఆదివారం 18 అక్టోబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

వంగవీటి బ్రాండ్ ఇక జనసేన సొంతం..

డిప్యూటీ సీఎం ద్విముఖ వ్యూహం!



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 17)

స్థానిక ఎన్నికల సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజకీయ వ్యూహాలు ఆసక్తి రేపుతున్నాయి. పార్టీని రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేసుకోవడంతోపాటు తన సొంత సామాజిక వర్గం మొత్తాన్ని తనవైపు తిప్పుకునేలా పవన్ పావులు కదుపుతున్నారని అంటున్నారు. స్థానిక ఎన్నికలు పార్టీ శ్రేణుల కోసమేనని గతంలోనే చెప్పిన పవన్, కేడర్ కు గుర్తింపు, గౌరవం ఇచ్చేలా కీలకమైన స్థానాలను దక్కించుకున్నారని చెబుతున్నారు. కార్పొరేషన్లు, మున్సిపల్ చైర్మన్ స్థానాలతోపాటు ఆయా పట్టణ సంస్థల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ పదవులలో గౌరవప్రదమైన సంఖ్యలో స్థానాలు తీసుకుని పార్టీని పూర్తిస్థాయిలో విస్తరించేలా పవన్ అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు. ప్రధానంగా విజయవాడ కార్పొరేషన్ దక్కించుకున్న జనసేనాని ఆ స్థానంలో మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణను ఎంపిక చేయడంలో తిరుగులేని వ్యూహాన్ని రచించారని అంటున్నారు.


విజయవాడ, వంగవీటి పవన్ ద్విముఖ వ్యూహం

రాష్ట్రంలో కీలకమైన విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ను పొత్తుల్లో భాగంగా దక్కించుకోవడం ద్వారా జనసేనాని వ్యూహం స్పష్టమవుతోందని అంటున్నారు. గోదావరి జిల్లాల తర్వాత కాపుల ప్రభావం ఎక్కువగా ఉండే విజయవాడ నగరంలో జనసేన జెండా ఎగరవేయడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఆ సామాజిక వర్గంపై బలమైన ముద్ర వేయాలని పవన్ భావిస్తున్నారని అంటున్నారు. అదే సమయంలో వంగవీటి బ్రాండ్ ను సొంతం చేసుకోవడం ద్వారా కాపుల్లో తన ఇమేజ్ మరింత పెంచుకునే దిశగా అడుగులు వేశారని చెబుతున్నారు. దీనివల్ల కాపు సామాజికవర్గాన్ని పవన్ ఆకర్షించారని అంటున్నారు. ఇప్పటికే ఆ సామాజికవర్గంలో పవన్ పట్ల సానుకూల వైఖరి ఉందని, తాజా నిర్ణయాల వల్ల చిన్న చిన్న అసంతృప్తులు ఉన్నప్పటికీ తొలగిపోయే పరిస్థితి ఉందని అంచనా వేస్తున్నారు.

వంగవీటి ముద్రపై శాశ్వత పట్టు

విజయవాడ మేయర్ గా వంగవీటి రాధాకృష్ణను నిలపడం ద్వారా పవన్ రాజకీయంగా పట్టు బిగించే వ్యూహాన్ని అమలు చేశారని అంటున్నారు. రాష్ట్రంలో వంగవీటి బ్రాండ్ కు పార్టీలకు అతీతంగా అభిమానులు ఉన్నారని, ఇన్నాళ్లు తమ నాయకుడు వంగవీటి మోహనరంగా వారసులకు సరైన గుర్తింపు లేదని వారిలో ఆవేదన ఉండేదని అంటున్నారు. ఈ కారణంగా నామినేటెడ్ పదవుల పందేరం జరిగిన ప్రతిసారి వంగవీటి వారసుడిగా మాజీ ఎమ్మెల్యే రాధాకృష్ణ పేరు ప్రముఖంగా వినిపించేదని అంటున్నారు. అయితే రకరకాల సమీకరణాలతో వంగవీటి పేరు వెనక్కి వెళ్లిపోయేదని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో మేయర్ గా వంగవీటి రాధాకృష్ణ పేరు తెరపైకి తీసుకురావడమే ▶ 2లో

స్థానికంలో 'సూపర్' సిక్స్.. !



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 17)

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయమే లక్ష్యంగా ప్రచార అస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. సాధారణంగా స్థానిక ఎన్నికల్లో ఓటర్లు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామీణ/పట్టణ అభివృద్ధిని ప్రధానంగా చూస్తారు. కూటమి నాయకుల విశ్లేషణలు, పార్టీ శ్రేణుల ప్రచారం ప్రకారం ఈ ఎన్నికల్లో కూటమికి ప్రధానంగా కలిసి వచ్చే పథకాలు ఇవేనని అంటున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రధాన కారణమైన 'సూపర్ సిక్స్' హామీలు ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించనున్నాయని చెబుతున్నారు.ఎన్టీఆర్ భరోసా పింఛన్లు: సామాజిక పింఛన్లను ఒకేసారి రూ.4,000లకు పెంచి నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు పంపిణీ చేస్తుండటం కూటమికి అతిపెద్ద సానుకూల అంశం. అలాగే దివ్యాంగులకు పింఛన్ను రూ. 6,000 కు పెంచడం గ్రామీణ, పట్టణ ఓటర్లలో కూటమిపై నమ్మకాన్ని పెంచింది.ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం (దీపం): దీపావళి కానుకగా ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రక్రియకు కార్యాచరణ సిద్ధం చేయడం మహిళా ఓటర్లలో సానుకూలత తెస్తోంది. ప్రస్తుతం ఈ పథకం నిధులను ముందుగానే జమ చేయనున్నారు.తల్లికి వందనం-ఉచిత బస్సు ప్రయాణం: పాఠశాలలకు వెళ్లే పిల్లల తల్లులకు ఇచ్చే 'తల్లికి వందనం', మహిళ లకు ఉచిత బస్సు ప్రయాణ హామీలపై ప్రజల్లో ఉన్న అంచనాలు కూటమికి కలిసొచ్చే అంశాలు. ప్రస్తుతం ఇవి నిర్విఘ్నంగా అమలవుతున్నాయి.



దేశాన్ని అగ్నిగుండం చేయాలని కుట్ర

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 17)

కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దేశంలో బంగ్లాదేశ్ తరహా ప్రభుత్వ మార్పును కోరుకుంటున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. అరాచకత్వాన్ని వ్యాప్తి చేసేందుకు యువత శక్తిని అవి దుర్వినియోగం చేస్తున్నాయని ఆరోపించారు. ఉత్తర్ ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో ఆయన శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ వ్యవస్థలను అస్థిరపరిచేందుకు ప్రజాస్వామ్యం ఎవరినీ అనుమతించదని స్పష్టం చేశారు. దేశనిర్మాణం దిశగా యువతను నడిపించాల్సింది పోయి... కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు అరాచక రాజకీయాల్లో యువతను పావులుగా వాడుకుంటున్నాయని విమర్శించారు. ఎన్నికల్లో ఓటములకు ప్రతీకారం తీర్చుకునేందుకు.. హింస, అరాచకత్వం ద్వారా ప్రభుత్వ మార్పును ▶మిగతా 2లో

గెలిచే దమ్ములేకే జగన్ పాన్ ఇండియా రౌడీయిజం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 17)



స్థానిక ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసే, వైసీపీ అధినేత జగన్ 'పాన్ ఇండియా రౌడీయిజం' చేస్తున్నారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇతర రాష్ట్రాల నుంచి గూండాలను రప్పించి విధ్వంసం సృష్టించడం, ఆ నెపాన్ని ప్రత్యర్థులపైకి నెట్టడం వైసీపీకి పరిపాటిగా మారిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆయన ▶ 2లో

టీడీపీ నేతలే జనసేన అభ్యర్థులు!

పొత్తుల రాజకీయాలపై సోషల్ మీడియాలో హాట్ టాపిక్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 17)

స్థానిక ఎన్నికల్లో కూటమి రాజకీయాలు ఆసక్తి రేపుతున్నాయి. సీట్ల సర్దుబాటు ఒక కొలిక్కి వచ్చిన తర్వాత అభ్యర్థులను పోటీకి నిలిపే విషయంలో చోటుచేసుకున్న రాజకీయం రసవత్తరంగా మారుతోంది. కూటమిలోని ప్రధాన పార్టీ అయిన టీడీపీపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చిన జనసేన, బీజేపీ పార్టీలు తమ కోటాలో వచ్చిన సీట్లలో సరైన అభ్యర్థులను పోటీకి పెట్టే విషయంలో ముల్లాగుల్లాలు పడుతున్నాయన చెబుతున్నారు. 4 మేయర్, 20 మున్సిపాలిటీలకు అభ్యర్థులను నిలిపే విషయంలో జనసేన అనుసరిస్తున్న వైఖరిపై సొంత పార్టీ కార్యకర్తలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. పార్టీలో తొలి నుంచి కొనసాగుతున్న వారి బదులుగా టీడీపీ నుంచి నాయకులను దిగుమతి చేసుకుని వారినే జనసేన అభ్యర్థులుగా పోటీకి పెట్టడంపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ జరుగుతోంది.జనసేన పార్టీ అభ్యర్థులుగా టీడీపీ నేతలే మున్సిపల్ ఎన్నికల బరిలో దిగుతుండటం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది. ఆ మాత్రం దానికి జనసేన వాటా సీట్లు అంటూ ప్రచారం చేసుకోవడం ▶మిగతా 2లో

మధ్యప్రదేశ్ సీఎంకు ఏపీ అభివృద్ధిని వివరించిన చంద్రబాబు

సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి
అమరావతి నిర్మాణం, రాష్ట్రంలోని అభివృద్ధి కార్యక్రమాలపై వివరించిన చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 17)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం ఉండవల్లిలోని ముఖ్య మంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసుకునే దిశగా ఈ భేటీ సాగింది.ఈ సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం సహా రాష్ట్రంలో తాము చేపట్టబోతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి చంద్రబాబు, మోహన్ యాదవ్‌కు సమగ్రంగా వివరించారు. నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంబంధించిన తన విజన్, ప్రణాళికలను ఆయనతో పంచుకున్నారు. అంతకుముందు, ముఖ్యమంత్రి నివాసానికి విచ్చేసిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌కు రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ భేటీలో లోకేశ్ కూడా పాలుపంచుకున్నారు. తాను ఇటీవలే పూర్తిచేసిన 'యువగళం' పాదయాత్ర విశేషాలతో ▶ 2లో

మిథున్‌రెడ్డి పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలి: బొండా ఉమ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 17)



స్థానిక ఎన్నికల నామినేషన్ల వేళ హింస చోటుచేసుకోవడంపై తెదేపా నేత బొండా ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఎన్నికలైనా హింసా మార్గంలో గెలవాలన్నదే వైకాపా నైజమని ఆరోపించారు. పుంగనూరులో ఎర్రచందనం స్మగ్లర్లు, రౌడీలు అరాచకం సృష్టించారని ధ్వజమెత్తారు. ఎంపీ మిథున్‌రెడ్డి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని మండిపడ్డారు. ఆయన పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో పోటీకి అనర్హుడిగా ప్రకటించాలన్నారు. అలాగే వైకాపా పార్టీ గుర్తింపును కూడా రద్దు చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

బీజేపీకి నచ్చని ఓట్లను తొలగిస్తున్నారు..

'సర్' ప్రక్రియపై మహేశ్ కుమార్ గౌడ్
'సర్' ప్రక్రియలో లోపాలున్నాయన్న టీపీసీసీ చీఫ్
ఓటర్ల జాబితా సవరణలో నిబంధనలు పాటించడం లేదని విమర్శలు
ఎన్నికల సంఘం స్వతంత్రతపై ఆందోళన



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 17)

సీఈసీ ఎంపిక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తొలగించారని ప్రశ్న
ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తీవ్ర లోపాలున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ▶ 2లో

మొదటిపేజీ తరువాయి

స్థానికంలో 'సూపర్' సిక్స్..!

'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్' – కేంద్ర నిధుల అస్త్రం

కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉండటంతో పాటు.. స్థానిక సంస్థల్లోనూ కూటమిని గెలిపిస్తే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్' గా మారి గ్రామాలకు, నగరాలకు కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నేరుగా వస్తాయని కూటమి ప్రచారం చేస్తోంది. ఇది కూడా భారీగానే వర్కవుట్ అవుతుందని అంటున్నారు.

ఉపాధి హామీ అనుసంధానం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని స్థానిక అభివృద్ధి పనులకు అనుసంధానించడం, పెండింగ్ బిల్లుల చెల్లింపులు గ్రామీణ ఓటర్లలో పట్టు పెంచుకోవడానికి సాయపడతాయి. ప్రస్తుతం భారీ ఎత్తున గ్రామాల్లో పనులు జరుగుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ ద్వారా వేల మంది లబ్ధి పొందుతున్నారు.అమరావతి, పోలవరం ప్రాజెక్టులు: కేంద్ర ప్రభుత్వం నుంచి అమరావతి రాజధాని నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టుకు లభించిన భారీ ఆర్థిక ప్యాకేజీలను కూటమి అభివృద్ధికి చిహ్నంగా చూపిస్తోంది. ప్రస్తుతం ఆయా ప్రాజెక్టుల పనులు వడివడిగా ముందుకు సాగుతున్నాయి. ఎన్నికల్లో వీటి ప్రభావం కూడా ఉండనుంది.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు

గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను అధికారంలోకి రాగానే రద్దు చేయడం భూయజమానులలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల్లో కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని బలపరిచింది. ఇది ఇప్పుడు కూటమికి సానుకూల ఓటు బ్యాంకుగా మారుతుందని అంచనా వేస్తున్నారు.

బీసీలకు 40% కేటాయింపు

స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ, కూటమి తరఫున 40 శాతం టిక్కెట్లను బీసీలకే కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రకటించారు. ఈ వ్యూహాత్మక నిర్ణయం బీసీ ఓటు బ్యాంకును కూటమి వైపు తిప్పుకోవడానికి పెద్ద ఊతంగా మారుతుందని భావిస్తున్నారు.

అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ: పట్టణ, నగర ప్రాంతాల్లో పేద ప్రజలు, కూలీల ఆకలి తీర్చడం కోసం రూ. 5లకే భోజనం అందించే అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడం మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమికి పట్టణ ఓటర్ల మద్దతు కూడగట్టడానికి ఉపయోగపడనుంది. మొత్తంగా స్థానిక ఎన్నికల్లో కూటమికి సూపర్ సిక్స్ విజయాన్ని తీసుకువస్తుందని అంటున్నారు.

భారత్ నుంచి అమెరికాకు 330 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

తన అనుబంధ సంస్థ మొసాబి మెటాలిక్స్ ద్వారా 15 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుంది. అయోవా రాష్ట్రంలో ఉక్కు కర్మాగార నిర్మాణానికి ఎస్సార్ గ్రూప్ ఈ భారీ మొత్తాన్ని సమకూర్చనుంది.మే నెలలో జరిగిన సెలక్ట్ యూఎస్ఏ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు సందర్భంగా.. అమెరికాలో 20.5 బిలియన్ డాలర్ల పెట్టుబడుల ప్రణాళికలను భారత పారిశ్రామిక వర్గాలు ప్రకటించాయి. ఇదిలా ఉంటే.. వచ్చేనెలలో జరగనున్న మధ్యంతర ఎన్నికల కోసం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఆ సభల్లో పెట్టుబడుల గురించి చెబుతున్నారు. తన ప్రభుత్వ హయాంలో 20 ట్రిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులు, పెట్టుబడి హామీలను సాధించామని చెప్పారు.

వంగవీటి బ్రాండ్ ఇక జనసేన సొంతం..

కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబును ఒప్పించారని చెబుతున్నారు. అదేసమయంలో వంగవీటిని టీడీపీ నుంచి జనసేనలోకి తీసుకురావడం కూడా పవన్ రాజకీయ చాణక్యానికి నిదర్శనంగా చెబుతున్నారు. దీనిద్వారా వంగవీటి బ్రాండ్ ను జనసేనాని సొంతం చేసుకున్నారని అంటున్నారు.

విజయవాడ నగరంపై పట్టు

రాష్ట్ర రాజకీయాల్లో విజయవాడ నగరం అత్యంత కీలకం. రాష్ట్ర రాజకీయాలకు విజయవాడే కేంద్రం. ఒకప్పుడు వ్యాపార, వాణిజ్య కేంద్రంగా విలసిల్లిన విజయవాడ రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్ర రాజకీయాలకు కేంద్రంగా మారింది. రాజధానికి సమీపంలో ఉన్న ఈ నగరంలోనే పెద్ద సంఖ్యలో నేతలు, ఉద్యోగులు నివసిస్తున్నారు. దీంతో విజయవాడ నగరానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రాముఖ్యత పెరిగింది. ఇలాంటి నగరంపై జనసేన జెండా ఎగురవేస్తే ఆ ప్రభావం రాష్ట్రం మొత్తం ఉంటుందని జనసేనాని పవన్ వ్యూహాత్మకంగా అడుగులు వేశారని అంటున్నారు. అందుకే తమ పార్టీ నేతలు ఎక్కువగా మచిలీపట్నం కార్పొరేషన్ కావాలని తొలి నుంచి హడావుడి చేసినప్పటికీ పవన్ మౌనంగా తన వ్యూహాన్ని అమలు చేశారని అంటున్నారు. పార్టీ అవసరాల రీత్యా విజయవాడ జనసేనకే దక్కాలనే ఆలోచనతో ముందుగా సరైన అభ్యర్థిని వెతికి ఆ తర్వాత ఆయన పేరుతో టీడీపీని ఒత్తిడి చేశారని అంటున్నారు. దీంతో వంగవీటి విషయంలో టీడీపీ అధిష్టానం వ్యతిరేకించలేక విజయవాడ కార్పొరేషన్ ను జనసేనకు అప్పగించిందని చెబుతున్నారు.

గెలిచే దమ్ములేకే జగన్ పాన్ ఇండియా రౌడీయిజం

ఒక పత్రికాప్రకటన విడుదల చేశారు."దారుణాలకు పాల్పడటం, వాటిని ఇతరులపైకి తోసేయడం గొడ్డలి పార్టీకి పుట్టుకతో వచ్చిన విద్య. గతంలో వివేకానందరెడ్డిని హత్య చేసి, ఆ నెపాన్ని చంద్రబాబుపై నెట్టి 'నారాసుర రక్తచరిత్ర' అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించిన వ్యూహాన్నే జగన్ రెడ్డి నేటికీ కొనసాగిస్తున్నారు" అని బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. పుంగనూరు ఎంపీ మిథున్ రెడ్డి.. కర్ణాటక, తమిళనాడు నుంచి రాడ్లు, కర్రలతో గూండాలను రప్పిస్తుండగా, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పంజాబ్ నుంచి ఏకంగా తుపాకులతో రౌడీలను దింపుతున్నారని, ఇది పాన్ ఇండియా రౌడీయిజం కాక మరేమిటని ఆయన ప్రశ్నించారు." వారి కార్లను వారే ధ్వంసం చేసుకుని, మా కార్యకర్తలపై దాడులకు తెగబడుతూ, తిరిగి మేమే అరాచకాలకు పాల్పడుతున్నట్లు బుకాయించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని జగన్ రెడ్డి బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని కుట్రలు పన్నుతున్నారు. రక్తంతో తడిచిన చేతులు ఎవరివో ప్రజలందరికీ తెలుసు" అని బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. పంజాబ్ నుంచి వచ్చిన రౌడీలను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారని, కూటమి కార్యకర్తలు చేతులు ముడుచుకుని కూర్చోబోరని, చట్టపరంగా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. నాటి రాజారెడ్డి నుంచి నేటి జగన్ రెడ్డి వరకు విధ్వంసాలు సృష్టించడమే వారి నైజమని, ఎన్నికల్లో బలం లేనప్పుడు భయపెట్టి గెలవాలనే వైఎస్ కుటుంబ విధానాన్ని ఇప్పుడు కూడా అమలు చేయాలని చూస్తే ప్రజలు తిరగబడతారని ఆయన హెచ్చరించారు.

బీజేపీకి నచ్చని ఓట్లను తొలగిస్తున్నారు..

ఆరోపించారు. ఈ ప్రక్రియలో పారదర్శకత లేదని, తనకు కూడా నోటీసు వచ్చిందని వెల్లడించారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఓటర్ల జాబితా సవరణలో నిబంధనలను సరిగా పాటించడం లేదని విమర్శించారు.ఓ వ్యక్తి మరణిస్తే వారి ఓటును తొలగించాలని, వేరే ప్రాంతానికి మారితే ఓటును బదిలీ చేయాలని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. అయితే, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి నచ్చని ఓట్లను ఏకపక్షంగా తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ప్రయోగిస్తున్న బీజేపీ.. ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని కూడా తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఎన్నికల సంఘం స్వతంత్రతపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియలో చేసిన మార్పులపైనా మహేశ్ గౌడ్ ప్రశ్నలు లేవనెత్తారు. సీఈసీ ఎంపిక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తొలగించారని కేంద్రాన్ని ప్రశ్నించారు. స్వతంత్ర సంస్థల విధుల్లో కేంద్రం జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని హెచ్చరించారు.

టీడీపీ నేతలే జనసేన అభ్యర్థులు!

ఎందుకని జనసేన కార్యకర్తలు సోషల్ మీడియాలో చర్చించుకుంటున్నారు. ఇదే సమయంలో టీడీపీ నేతలు కూడా ఈ పరిస్థితి పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనసేన, బీజేపీలకు మున్సిపాలిటీలను ఇచ్చేసిన తర్వాత నాయకులను కూడా పంపాల్సిన పరిస్థితులు ఏర్పడటమే వారిని ఆవేదనకు గురిచేస్తోందని అంటున్నారు.పొత్తుల్లో భాగంగా జనసేన నాలుగు కార్పొరేషన్లలో పోటీ చేస్తుండగా, రెండు కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో ప్రధానమైన విజయవాడ కార్పొరేషన్ అభ్యర్థిగా సీనియర్ నేత వంగవీటి రాధాకృష్ణను ఖరారు చేశారు. రాధాకు మేయర్ సీటు అంటూ చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. పార్టీ కూడా ఆయనను అభ్యర్థిగా ప్రకటించింది. అయితే రాధాకృష్ణ నిన్నమొన్నటి వరకు టీడీపీలోనే ఉన్నారు. ఇప్పుడు కండువా మార్చుకుని జనసేన తరఫున మేయర్ గా పోటీ చేయడంపై కార్యకర్తలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి రాష్ట్రంలో చాలా చోట్ల ఉందని అంటున్నారు.జనసేనకు కేటాయించిన పలు మున్సిపాలిటీలో చైర్మను అభ్యర్థులుగా టీడీపీ వారే పోటీకి దిగుతున్నారని, పదవి కోసం కండువా మార్చుకుని జనసేన గుర్తుపై పోటీకి సిద్ధమవుతున్నారని అంటున్నారు. తుని మున్సిపల్ సీటు విషయంలో ఇదే జరగ్గా, రామచంద్రాపురంలో కూడా జనసేనలోకి వచ్చి టీడీపీ నేతలు పోటీకి సిద్ధమవడంపై కార్యకర్తలు ముఖంమీదే నిలదీస్తున్నారని అంటున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదే సమయంలో టీడీపీలో కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది.బలం లేకపోయినా జన సేన కొన్ని మున్సిపాలిటీలను తీసుకుందని, అక్కడ సరైన అభ్యర్థులు లేక తెల్ల ముఖం వేస్తోందని టీడీపీ కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో టీడీపీ కార్యకర్తలకు నచ్చజెప్పడం మంత్రులు, ఎమ్మెల్యేలకు భారం అవుతూందని అంటున్నారు. మన్యం జిల్లాలోని సాలూరు మున్సిపాలిటీని జనసేనకు కేటాయించగా, అక్కడ సరైన అభ్యర్థే లేరని, 2 శాతం ఓటింగుతో జనసేన ఎవరిని నిలబెడుతుందని టీడీపీ నాయకులు నిలదీస్తున్నారు. ఇదే సమయంలో కార్యకర్తల బాధను చూడలేక మంత్రి సంధ్యారాణి కన్నీరు పెట్టుకున్నారు. ఇక విజయనగరం జిల్లాలోనూ ఇటువంటి పరిస్థితే నెలకొంది. ఈ నియోజకవర్గంలో రాజాం, నెల్లిమర్ల నగర పంచాయతీలను జనసేనకు కేటాయించారు. అయితే రాజాంలో జనసేనకు సరైన నాయకులు లేరని, అవసరమైతే ఆ పార్టీలోకి టీడీపీ నాయకులే వెళ్లి పోటీ చేయాల్సివుంటుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.ఈ పరిణామాలు గమనిస్తుంటే పొత్తుల్లో భాగంగా సీట్లు తీసుకున్న జనసేన, అక్కడ సరైన అభ్యర్థులు ఉన్నారా? లేరా? అన్నది ముందుగా పరిశీలించలేదని అంటున్నారు. దీనివల్ల టీడీపీ నాయకులే కండువాలు మార్చుకుని జనసేన తరఫున పోటీకి దిగాల్సిన పరిస్థితులు నెలకున్నాయని అంటున్నారు. దీనిపై రెండు పార్టీల్లోనూ అసంతృప్తులు, నిరసన స్వరాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. అయినప్పటికీ విజయం కోసం అంతా కలిసి పనిచేస్తామని పైకి చెబుతున్నారని, అయితే ఎన్నికల్లో ప్రజలు మాత్రం ఏ విధంగా స్పందిస్తారో చూడాల్సివుందని అంటున్నారు. మొత్తానికి తాజా ఎన్నికలు మరోసారి నేతల సర్దుబాటుపై హాట్ టాపిక్ అవుతున్నాయి.

దేశాన్ని అగ్నిగుండం చేయాలని కుట్ర

హస్తం పార్టీ కోరుకుంటోందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. "బంగ్లాదేశ్ తరహాలో ప్రభుత్వాన్ని మార్చేయాలని బహిరంగంగా చెబుతున్నారు. మరొకరేమో ప్రభుత్వాన్ని కూలగొడతామంటున్నారు. అంటే... ప్రజాస్వామ్య వ్యవస్థలను దెబ్బతీసి... దేశాన్ని అగ్నిగుండం చేయాలన్నది వారి ఎజెండా అనేది స్పష్టమవుతోంది. మహాత్మాగాంధీ ఆనాడు చౌరీచౌరాలో హింస జరిగిందని సహాయ నిరాకరణ ఉద్యమాన్నే ఆపేశారు.ఆయన రాజకీయ వారసులమని చెప్పుకొనే కాంగ్రెస్ మాత్రం... ఎన్నికల్లో తమ వరుస పరాజయాలను తట్టుకోలేక హింస, అరాచకాలకు పాల్పడుతోంది. నైతిక విలువల పరంగా ఆ పార్టీ ఎంతగా దిగజారిందో చెప్పేందుకు ఇదే నిదర్శనం. అరాచకం ప్రబలి... దేశమంతా అగ్నిగుండంలా మారాలని, బంగ్లాదేశ్‌లాంటి పరిస్థితి నెలకొనాలని కాంగ్రెస్ కలలు కంటోంది. గాంధీ... పేరును వాడుకునే నైతిక హక్కును ఆ పార్టీ కోల్పోయింది" అని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఓటు చోరీ ఆరోపణలనూ ఆయన తిప్పికొట్టారు. "దశాబ్దాలుగా కాంగ్రెస్‌పార్టీ సొంతగా మెజార్టీ సాధించలేకపోతోంది. 1984 తర్వాత ఎప్పుడైనా ఆ పార్టీ మెజార్టీ సీట్లు గెల్చుకుందా? మరలాంటప్పుడు కాంగ్రెస్ పరిస్థితికి కారణం వారి పాలనా వైఫల్యమా? లేక ఓటుచోరీనా?" అని రాజ్‌నాథ్ ప్రశ్నించారు. ఓటుచోరీ అంటూ గోలపెడుతున్న కాంగ్రెస్ ఇప్పటిదాకా ఓటరు జాబితాలో అవకతవకలపై ఒక్క అప్పీలు కూడా దాఖలు చేయలేదని గుర్తుచేశారు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ మద్దతు లేకుండా కాంగ్రెస్ రాయ్‌బరేలీ సీటు కూడా నెగ్గలేదని రాజ్‌నాథ్ ఎద్దేవా చేశారు.సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ప్రభుత్వ మార్పు కోసం పిలుపునివ్వడంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మండిపడ్డారు. ప్రస్తుతం దిమాగీ నక్సల్స్‌కు, దేశభక్తులకు మధ్య పోరు మొదలైందన్నారు. దేశ ద్రోహులను గుర్తుంచుకొని శిక్షించాలని 'ఎక్స్' వేదికగా ప్రజలకు పిలుపునిచ్చారు.

దేశాన్ని అస్థిరపరచాలన్న ఎజెండా తేటతెల్లమైంది: నబీన్

ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలన్న ఏకైక కాంక్షతో విపక్షాలు నిరసనలు చేపడుతున్నాయని భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. విదేశీ శక్తులతో కలిసి దేశాన్ని అస్థిరపరచాలన్న ఎజెండా ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యలతో తేటతెల్లమైందని 'ఎక్స్'లో ఆయన పేర్కొన్నారు.

ప్రతిపక్షం ఉన్నదే గద్దె దించేందుకు: కాంగ్రెస్

'ప్రభుత్వ మార్పు' వ్యాఖ్యలపై భాజపా విమర్శలు గుప్పిస్తున్న వేళ కాంగ్రెస్ ఎదురుదాడికి దిగింది. ప్రభుత్వాన్ని గద్దె దించడమే ప్రజాస్వామ్యంలో విపక్షాల పని అని పేర్కొంది. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ గతంలో చేసిన వ్యాఖ్యలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు, అధికార పార్టీకి గుర్తుచేసింది. "వ్యతిరేకించడం.. ఎండగట్టడం.. అవసరమైతే గద్దె దించడం.. ఇవే ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల పనులని మాజీ రాష్ట్రపతి, భారతరత్న పురస్కార గ్రహీత ప్రణబ్ ముఖర్జీ స్పష్టంగా చెప్పారు. ఆయన వ్యాఖ్యలను రాజ్‌నాథ్, భాజపా గుర్తుతెచ్చుకోవాలి" అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. ప్రభుత్వ మార్పు వ్యాఖ్యలను దేశ వ్యతిరేకమైనవిగా చిత్రీకరిస్తుండటాన్ని తప్పుబట్టారు.

మధ్యప్రదేశ్ సీఎంకు ఏపీ అభివృద్ధిని వివరించిన చంద్రబాబు

కూడిన పుస్తకాన్ని ఆయన మోహన్ యాదవ్‌కు బహూకరించారు. తన పాదయాత్ర అనుభవాలను, ప్రజల నుంచి వచ్చిన స్పందనను, రాష్ట్ర సమస్యలపై తాను చేసిన అధ్యయనాన్ని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రికి లోకేశ్ వివరించారు.

పేద పారిశుద్ధ్య కార్మికులకు అండగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ

అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా 38 మంది కార్మికులకు చీరలు, దుస్తుల పంపిణీ





(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 17)

అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కంభం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మార్కాపురంజిల్లా కంభం మండలం కందులాపురం పంచాయతీకి చెందిన 38 మంది పేద పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. పేదలకు అండగా నిలవడం, సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కంభం అధ్యక్షుడు ప్రభుదాసు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సంస్థ కేంద్ర కమిటీ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి ఏసేపు, జిల్లా డైరెక్టర్ కాటమాల చెన్నకేశవరావు పాల్గొన్నారు. అలాగే సంస్థ కంభం కార్యదర్శి పరమేశ్వర్‌రెడ్డి, కన్వీనర్ అంకయ్యగౌడ్, సభ్యులు వెంకటేశ్వర్లు, అన్వర్ భాష, టిప్పుఖాన్, కృష్ణ, రంగారెడ్డితో పాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేసి, వారి సేవలను గుర్తించారు. పేదలకు సహాయం అందించడం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం వంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

విశ్వ వికాస భారతి సేవా సంస్థ తరఫున దసరా ఉత్సవాలు సందర్భంగా మహిళా సేవకులకు బిరుదు ప్రధానం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 17)

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో గణపతి మండపాల్లో దసర నవరాత్రుల్లో దేవీ దేవతలకు భక్తి తత్పరతతో అలంకరణలు నిర్వహించే మహిళా సేవకులకు శ్రీ విశ్వ వికాస భారతి సేవా సంస్థ తరఫున ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాలు సందర్భంగా బిరుదు ప్రధానం చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మశ్రీ పోతులూరి శివబ్రహ్మాచార్యులు మాట్లాడుతూ ధార్మిక కార్యక్రమాలు, పేదవారికి నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వారిని గుర్తించి తగిన విధంగా గుర్తించి ప్రోత్సహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా విశేష అలంకరణలు చేసిన మహిళలకు ఒంగోలు వెంకటేశ్వర కాలని శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగాయి. సన్మాన గ్రహీతలు దేవరపల్లి అలేఖ్య, పాశం కల్పన, పుల్లంశెట్టి శ్రావణ జ్యోతి, టంగుటూరి శ్రీదేవి గౌరవ పురస్కారం అందుకోవడం విశేషం. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు దేపూరి వెంకట్రావు, శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయం శాశ్వత ధర్మకర్తలు బ్రహ్మశ్రీ స్వర్ణ దుర్గా శ్రీనివాస్, గడ్డం సత్యనారాయణ, గౌరవ సలహాదారులు నిమ్మల అనిల్ కుమార్, అధ్యక్షులు అద్దేపల్లి శివరామరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. సహాయ సహకారాలు అందించిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.









షణ్ముఖ
తెలుగు
ప్రతి వార్త తెలుగు వైపు
తెలుగు దినపత్రిక
18.10.26 ఆదివారం

ఒంగోలు నగర మేయర్ అభ్యర్థిగా నల్లమల్లి శ్రీ శిల్ప



టీడీపీ అధిష్టానం అధికారిక ప్రకటన

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి నామినేషన్ దాఖలుకు సన్నాహాలు

(షణ్ముఖ తెలుగు, ఒంగోలు, అక్టోబర్ 17)

ఒంగోలు నగర మేయర్ అభ్యర్థిగా కూటమి ప్రభుత్వం తరఫున తెలుగుదేశం పార్టీ బలపరిచిన నల్లమల్లి బాలు సతీమణి నల్లమల్లి శ్రీ శిల్ప పోటీ చేయనున్నారు. ఈ మేరకు టీడీపీ అధిష్టానం ఆమె అభ్యర్థిత్వాన్ని అధికారికంగా శనివారం రాత్రి ప్రకటించింది. ఒంగోలు నగర మేయర్ పదవికి నల్లమల్లి శిల్పను ఎంపిక చేయడంతో నగర రాజకీయాల్లో ఆసక్తి నెలకొంది. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు ఆమె మేయర్ అభ్యర్థిగా బరిలో నిలవనున్నారు. అటు వైసీపీ, ఇటు టీడీపీ నుండి ఇద్దరు ఆర్యవైశ్యులు బరిలో నిలవడం మేయర్ ఎన్నిక రసవత్తరంగా మారనుంది.



ప్రకాశం జిల్లా ఎన్నికల అబ్జర్వర్‌గా హెప్సీబా రాణి

(షణ్ముఖ తెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, అక్టోబర్ 17)

ప్రకాశం జిల్లా ఎన్నికల అబ్జర్వర్‌గా గృహ నిర్మాణ శాఖ స్పెషల్ సెక్రటరీ హెప్సీబా రాణిని నియమించారు. ఈ మేరకు ఆమె శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ, బీసీ కార్పొరేషన్ ఈడి వెంకటేశ్వర్లు, హౌసింగ్‌శాఖ పిడి తదితరులు పుష్పగుచ్ఛాన్ని అందించి ఆమెకు స్వాగతం పలికారు.



కోలాహలంగా టీడీపీ చైర్మన్ అభ్యర్థి వక్కలగడ్డ నామినేషన్



భారీ ర్యాలీతో ఎమ్మెల్యే కందుల, జనసేన ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ పివి కృష్ణారావు, ఇతర నేతలతో కలిసి నామినేషన్ దాఖలు చేసిన కూటమి అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జున్

చైర్మన్ అభ్యర్థితో పాటు 40 వార్డులకు నామినేషన్లు దాఖలు చేసిన కౌన్సిలర్ అభ్యర్థులు

ర్యాలీలో భారీగా పాల్గొన్న కూటమి నేతలు, కార్యకర్తలు



(షణ్ముఖ తెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 17)

మార్కాపురం పట్టణంలో తెలుగుదేశం పార్టీ కోటమ నాయకుల ఆధ్వర్యంలో మార్కాపురం మున్సిపల్ చైర్మన్‌గా వక్కలగడ్డ మల్లికార్జున ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నామినేషన్ వేయడం జరిగినది. శనివారం మార్కాపురం పట్టణంలో కూటమి నాయకులు ఆధ్వర్యంలో కూటమి మున్సిపల్ అభ్యర్థులు చైర్మన్ మొక్కల గడ్డ మల్లికార్జున తో పాటు 40 మంది వార్డు సభ్యులు నామినేషన్ దాఖలు చేయడం జరిగినది. ముందుగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి మల్లికార్జున ఇంటి వద్దకు చేరుకొని భారీ జన సంద్రోహంతో ర్యాలీగా నామినేషన్ దాఖలు చేయడానికి ఓటమి నాయకులు టిడిపి నాయకులు పట్టణ ప్రజలు ఆధ్వర్యంలో నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఒక్కలగడ్డ మల్లికార్జున కూటమి నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసుకొని ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపు కోసం కృషిచేసి గెలిపించాలని కోరారు. ఈ గెలుపు మనందరం కలిసి మార్కాపురం ఎమ్మెల్యే మన నాయకుడు కందుల నారాయణరెడ్డి కి గిఫ్ట్‌గా ఇవ్వాలని అన్నారు. ▶మిగతా 4లో

వైసీపీ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా పులి శాంతి నామినేషన్



(షణ్ముఖ తెలుగు, కనిగిరి, అక్టోబర్ 17)

కనిగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ వైసీపీ అభ్యర్థిగా పులి శాంతి శనివారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. మాజీ కేంద్రమంత్రి స్వర్గీయ పులి వెంకటరెడ్డి వీధిలోని ఆమె నివాసం నుండి పార్టీ కార్యకర్తల భారీ ర్యాలీతో పట్టణంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. వైసీపీ ముఖ్య నాయకులతో పాటు పార్టీ క్యాడర్ పెద్ద ఎత్తున నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చారు. పులి శాంతి ర్యాలీలో అభ్యర్థితో పాటు ఆమె తల్లి పులి లక్ష్మి, జిల్లా వైసీపీ అధ్యక్షులు బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్, మాజీ రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డిలతో పాటు ఆరు మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పులి శాంతి కుటుంబానికి పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలతో మంచి సత్సంబంధాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుపేదలకు కొత్తగా ఒక్క పింఛను, రేషన్ కార్డు, పక్కా ఇళ్ళు కూడా మంజూరు కాలేదని, అన్ని వర్గాల ప్రజలు వైసీపీ వైపే ఉన్నారని ఛైర్‌పర్సన్ అభ్యర్థి పులి శాంతి ధీమాతో ఉన్నారు. ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా నాలుగు రోజుల క్రితమే వైసీపీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆమె ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. దాదాపు అన్ని వార్డుల్లో పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను కూడా ప్రకటించింది. ఆ మేరకు కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్‌లు కూడా శనివారం దాఖలు చేశారు. ▶మిగతా 4లో

కూటమి ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా తిరుపతమ్మ


ఈ నెల 12నే వాటర్‌షెడ్ ఉద్యోగానికి రాజీనామా

25వ వార్డు కౌన్సిలర్‌గా గోనుగుంట్ల పవన్ నామినేషన్

32వ వార్డు కౌన్సిలర్‌గా పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్ నామినేషన్

నేడు అట్టహాసంగా కూటమి ఛైర్‌పర్సన్ అభ్యర్థి నామినేషన్ ప్రక్రియ

తిరుతమ్మ అభ్యర్థి అని ముందే చెప్పిన "షణ్ముఖ తెలుగు"



(షణ్ముఖ తెలుగు, కనిగిరి, అక్టోబర్ 17)

కనిగిరి మున్సిపాల్టీ ఓసి మహిళకు కేటాయించారు. ఛైర్మన్ అభ్యర్థిత్వాన్ని ప్రధానంగా ముగ్గురు ఆశించారు. శనివారం రాత్రి పట్టణ తెలుగుయువత అధ్యక్షులు అచ్చాల రవి సతీమణి అచ్చాల తిరుపతమ్మ పేరును ఖరారు చేస్తూ టిడిపి అధిష్టానం మూడో జాబితాను విడుదల చేసింది. అయితే శనివారం ఉదయం కూటమి పార్టీల తరుపున ఎమ్మెల్యే ఉగ్ర కుమార్తె ఊహ శ్రీ తప్ప మిగతా ముగ్గురు అచ్చాల తిరుపతమ్మ, గోనుగుంట్ల లక్ష్మీ కుమారి, ఫిరోజ్ తల్లి నామినేషన్లు దాఖలు చేశారు. తిరుపతమ్మ ఈ నెల 12నే వాటర్ షెడ్‌లో టెక్నికల్ అసిస్టెంట్ ▶మిగతా 4లో

కొనకనమిట్ల గ్రామ శివారులో నవీన్‌రెడ్డి దారుణ హత్య

(షణ్ముఖ తెలుగు, పొదిలి, అక్టోబర్ 17)







మార్కాపురం జిల్లా కొనకనమిట్ల మండల కేంద్రంలో భూవివాదం నేపథ్యంలో పునుగోటి నవీన్ రెడ్డి (24) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే....మార్కాపురం జిల్లా కొనకనమిట్ల మండల కేంద్రంలో భూవివాదం నేపథ్యంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామ శివారులోని కొండ ప్రాంతంలో యువకుడిని అత్యంత కిరాతకంగా హతమార్చినట్లు వెలుగులోకి రావడంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. గతంలో ఇరు కుటుంబాల మధ్య భూ వివాదాలు తలెత్తడం, ఈ నేపథ్యంలో గొడవలు జరిగి కేసులు కూడా నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. ఈ పాత కక్షలే హత్యకు కారణమై ఉండవచ్చనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


ఆరు నెలల క్రితం ఇరు కుటుంబాల మధ్య వివాదం

కొనకనమిట్ల గ్రామానికి చెందిన పునుగోటి నవీన్ రెడ్డి (24) అనే యువకుడు గ్రామ శివారులోని కొండ ప్రాంతంలో హత్యకు గురయ్యాడు. నవీన్ రెడ్డి కుటుంబానికి, మరో కుటుంబానికి మధ్య సుమారు ఆరు నెలల క్రితం భూ వివాదాలు తలెత్తినట్లు సమాచారం. ఈ వివాదం క్రమంగా ఇరు వర్గాల మధ్య గొడవలకు దారితీసింది. ఈ క్రమంలో ఇరువర్గాల వారు పరస్పరం కేసులు కూడా నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. భూ వివాదం నేపథ్యంలో అప్పటి నుంచి నవీన్ రెడ్డిపై కొందరు వ్యక్తులు కక్ష పెంచుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే యువకుడి హత్యకు పథకం రచించి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే హత్యకు దారితీసిన అసలు కారణాలు, ఘటనలో ఎవరెవరి ప్రమేయం ఉందనే అంశాలపై పోలీసులు మరింత లోతుగా విచారణ చేపట్టాల్సి ఉంది.

గ్రామ శివారులోని కొండ ప్రాంతంలో హత్య

శుక్రవారం సాయంత్రం గ్రామ శివారులోని కొండ ప్రాంతం వద్ద నవీన్ రెడ్డి హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు. భూ వివాదాల నేపథ్యంలో ఆరుగురు వ్యక్తులు కలిసి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. యువకుడి హత్య వార్త గ్రామంలో వేగంగా వ్యాపించడంతో స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ▶మిగతా 4లో

కోలాహలంగా టీడీపీ చైర్మన్ అభ్యర్థి వక్కలగడ్డ నామినేషన్







వక్కలగడ్డ మల్లికార్జున 2014 సంవత్సరంలో ఆయన సతీమణి వక్కలగడ్డ రాధిక మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా గెలిచి మార్గపురం పట్టణ ప్రజలకు ఎనలేని సేవలు చేయటం ప్రజలందరూ చూశారన్నారు. ఇప్పుడు మా కుటుంబాన్ని గెలిపిస్తే మీ అందరికీ







రుణపడి ఉంటామని, మీకు ఏ సమస్య వచ్చినా తాను అండగా





ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ కోసం, పార్టీ సిద్ధాంతాల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ముందుగా ఇంటి వద్దకు ప్రజలు, నాయకులు భారీగా చేరుకొని చైర్మన్ అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జునను సన్మానించారు. అనంతరం అక్కడికి వచ్చిన నాయకులకు, కార్యకర్తలకు, అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజవర్గ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మార్కాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు షేక్ వహీద్, జనసేన మార్కాపురం ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్, బిజెపి జిల్లా అధ్యక్షులు పివి కృష్ణారావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకట్‌రెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనకనమిట్ల గ్రామ శివారులో నవీన్‌రెడ్డి దారుణ హత్య

గతంలో భూమి విషయంలో తలెత్తిన వివాదాలు, పరస్పరం నమోదైన కేసులు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. పాత కక్షలే ఈ హత్యకు కారణమా? ముందస్తు ప్రణాళికతోనే ఈ ఘటనకు పాల్పడ్డారా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు

తన కుమారుడు నవీన్ రెడ్డిని కొందరు వ్యక్తులు హత్య చేశారని ఆరోపిస్తూ అతని తండ్రి గురవారెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించి ఇన్‌చార్జి సీఐ బి వినోద్ కుమార్, ఎస్ఐ శ్రీకాంత్ వివరాలు వెల్లడించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలతో పాటు గతంలో ఇరు కుటుంబాల మధ్య చోటుచేసుకున్న భూ వివాదాలు, నమోదైన కేసులు, హత్యకు దారితీసిన పరిస్థితులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

నిందితుల కోసం పోలీసుల దర్యాప్తు

ఈ ఘటనలో అనుమానితులుగా పేర్కొంటున్న వ్యక్తులు పరారీలో ఉన్నట్లు సమాచారం. వారి ఆచూకీ గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. హత్యకు సంబంధించిన ఆధారాలను సేకరించడం, ఘటనకు ముందు, తర్వాత చోటుచేసుకున్న పరిణామాలను తెలుసుకోవడం, సంబంధిత వ్యక్తులను విచారించడం ద్వారా కేసులో పూర్తి వివరాలను వెలికితీసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. భూవివాదాల కారణంగా గతంలోనే ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరిగి కేసులు నమోదైన నేపథ్యంలో, ఈ హత్య వెనుక ఉన్న కారణాలను నిర్ధారించడం పై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. మొత్తంగా కొనకనమిట్లలో భూవివాదం నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ యువకుడి హత్య స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పాత కక్షలే ఈ ఘటనకు కారణమా? హత్య వెనుక ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే ప్రశ్నలకు పోలీసుల దర్యాప్తులో సమాధానాలు లభించాల్సి ఉంది.

కూటమి చైర్‌పర్సన్ అభ్యర్థిగా తిరుపతమ్మ

ఉద్యోగానికి కూడా రాజీనామా చేసింది. ప్రముఖ సిండికేట్ వ్యాపారి గోనుగుంట్ల పవన్ కుమార్ 25వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయగా, 32వ వార్డు కౌన్సిలర్‌గా పట్టణ టిడిపి అధ్యక్షుడు ఫిరోజ్ ఆదివారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. అధికారికంగా కూటమి చైర్‌పర్సన్ అభ్యర్థి తిరుపతమ్మ నామినేషన్ ప్రక్రియ ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని కూటమి, పార్టీ శ్రేణులు కనిగిరి నియోజకవర్గంలోని పార్టీ అభిమానులు, పట్టణ ప్రజలు నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలి రావాలని తెలుగుదేశంపార్టీ కార్యాలయ ప్రతినిధులు పిలుపునిచ్చారు.

వైసీపీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా పులి శాంతి నామినేషన్





చీరాల టిడిపి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా యోరిచర్ల హనీ స్పందన



కష్టపడే కార్యకర్తకు సముచిత గుర్తింపు

(షణ్ముఖ వెలుగు, చీరాల, అక్టోబర్ 17)

చీరాల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా యోరిచర్ల హనీ స్పందనను నియమిస్తూ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నియామకం పై కూటమి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. యోరిచర్ల హనీ స్పందన మొదటి నుంచి విద్యార్థి సంఘం (స్టూడెంట్ ఫెడరేషన్) కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ టీడీపీ కార్యకర్తగా పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. పార్టీ అధికారంలో లేని సమయంలోనూ వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేశారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే సామాన్య కార్యకర్తలకు సైతం సముచిత గుర్తింపు, పదవులు లభిస్తాయనే విషయాన్ని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఈ నియామకం ద్వారా చాటిచెప్పారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసిన హనీ స్పందనకు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా అవకాశం కల్పించడంపై కూటమి శ్రేణులు సంతోషం వ్యక్తం చేశాయి.

డిమాండ్‌లు తీర్చే వరకు ఉద్యమం ఆగదు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 17)

తమ న్యాయమైన డిమాండ్‌లు తీరేవరకు మా ఉద్యమం ఆగదని ఎంప్లాయిస్ యూనియన్ పొదిలి డిపో నాయకులు అన్నారు. పొదిలి డిపో నందు 6వ రోజు నిరాహార దీక్ష అధ్యక్షుడు కేవీ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. దీక్షా శిబిరంలో పీఎస్ రావు కండక్టర్‌ని జోనల్ అధ్యక్షులు బెజవాడ రవి, ఎస్ఎస్ రెడ్డి, డ్రైవర్‌ని రీజినల్ మెయింటినెన్స్ కమిటీ మెంబర్ పి కొండలరావు పూలమాల వేసి దీక్షలో కూర్చో బెట్టారు. ఈ సదస్సును ఉద్దేశించి బెజవాడ రవి మాట్లాడుతూ అక్రమంగా వేసిన డ్యూటీ చార్జ్‌ను వెంటనే రద్దు చేసి డిపోలో నెలకొన్న అనిశ్చితిని పారద్రోలాలని కోరారు. రీజినల్ కమిటీ బాధ్యులు కెవి రావు మాట్లాడుతూ గ్యారేజీ నందు 8 గంటల పనిగంటలు సరిగా చేసేటట్లు చూడాల్సిన బాధ్యత డిఎం దేనని వివరించారు. పిఏఎన్ రెడ్డి మాట్లాడుతూ గ్యారేజీ నందు కొత్తగా చార్జు వేసి ఇంప్లిమెంట్ చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, గ్యారేజ్ సిబ్బంది, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

చీరాలలో వైసీపీ జోష్

చైర్మన్ అభ్యర్థిగా షెర్లి నామినేషన్

కరణం వెంకటేష్ బాబు హాజరుతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం



(షణ్ముఖ వెలుగు, చీరాల, అక్టోబర్ 17)

చీరాల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున డాక్టర్ ఇస్తార్ల షెర్లి నామినేషన్ దాఖలు చేశారు. శనివారం చీరాల మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి చీరాల వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై అభ్యర్థికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, పార్టీ శ్రేణుల హాజరుతో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైసీపీ శిబిరంలో రాజకీయ సందడి నెలకొంది.

టిడిపిలో చేరిన 2వ డివిజన్ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 17)

2 వ డివిజన్ ముక్తినూతలపాడు గ్రామం నుండి వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం జిల్లా టిడిపి కార్యాలయంలో టిడిపి పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు వారికి టిడిపి కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బండారు మదన్, కామేపల్లి శ్రీనివాసరావు, రాయపాటి బాబురావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
5 | 18.10.26 ఆదివారం

అనాదిగా సనాత హిందూ సంప్రదాయంలో గ్రామ దేవతల ఆరాధన

ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 17)

సనాతన హిందూ సంప్రదాయంలో గ్రామ దేవతల ఆరాధన అనాదిగా ఉందని ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా కేశవస్వామిపేట లోని శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి వారి దేవస్థానంలో మంత్రి ప్రగడ నరసింహారావు స్మృత్యర్థం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో రెండవ రోజు గ్రామ దేవతలు – ఆరాధన అనే అంశంపై ప్రవచనం చేశారు. సాక్షాత్తు పార్వతీదేవి అంశతో పోలేరమ్మ, అంకమ్మ, ముత్యాలమ్మ, పోచమ్మ, బంగారమ్మ, మారెమ్మ, ఎల్లమ్మ అనే ఏడుగురు అక్కాచెల్లెళ్ళు అవతరించారని వీరే గ్రామ దేవతలగా గ్రామాలకు రక్షకులుగా ఆరాధించబడుతున్నారని అన్నారు. వీరికి తోడుగా విష్ణుశక్తి అంశంగా పోతరాజు అవతరించారని తెలిపారు. గతంలో మలేరియా, మసూచి లాంటి ప్రాణాంతక వ్యాధులు ప్రాబలినప్పుడు గ్రామ ప్రజలను కాపాడి పునర్జన్మయిచ్చే దేవతగా గ్రామ దేవతలను ఆరాధించే వారని, అలానే కరువు కాటకాలనుంచి గ్రామాన్ని రక్షించే దేవతా స్వరూపిణిగా అమ్మకు కొలుపులు, జాతరలు నిర్వహించే వారిని అన్నారు. 101 మంది గ్రామ దేవతలు వివిధ నామాలతో ఆయా గ్రామాల పొలిమేరలలో పూజలు అందుకుంటున్నారని అన్నారు. గ్రామ దేవతల ఆరాధన, పూజా కైంకర్యాలు సర్వ మానవ సమానత్వాన్ని ప్రతిబింబిస్తాయిని చెప్పారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని సరస్వతీ దేవి చిత్రపటానికి అర్చకస్వామి రాంబాబు ఆచార్యులు పూజా కార్యక్రమాన్ని జరిపించారు. కార్యక్రమ నిర్వాహకులు మంత్రి ప్రగడ ప్రసాద్, ఆలయ ఈవో రావెళ్ల శివశంకర్, అక్కినేని కళా పరిషత్ అధ్యక్షులు కల్లగుంట కృష్ణయ్య, ఆనందమయ సాహితీ సంస్థ ప్రధాన కార్యదర్శి అన్ను విజయ కుమారి, ప్రముఖ గాయకులు మొవ్వ నాగేశ్వరరావు, ఐ మురళీకృష్ణ, సాహితీ విమర్శకులు ఓరుగంటి ప్రసాద్, వ్యాఖ్యాత గుఱ్ఱం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.





రెంటచింతల ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా జి జనార్ధనరావు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 17)

రెంటచింతల మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా గుండా జనార్దన్ రావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కే అంజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె షరీఫ్, జి బాబురావు ప్రధాన కార్యదర్శిగా డేగల మహేష్ కే శ్రీరామ్ మూర్తి, కార్యదర్శులుగా ఏ కోటేశ్వరరావు, పి మనోహర్, కోశాధికారిగా వై కేదార్నాథ్, సలహాదారునిగా అంజి ఎన్నికయ్యారు. సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో శనివారం ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫాదర్ గోవింద బాలస్వామి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి వి.మురళి, ఐజేయు సభ్యులు జి శ్రీనివాసరావు, ఎంఎస్ నాగేశ్వరరావు, కొత్తమాసు శ్రీరామమూర్తి, అక్బర్, ఆది విష్ణు, ఖాన్, వెంకట్, తుమ్మ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పి మురళి నూతనంగా ఎన్నికైన సభ్యులచే ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ మండల విలేకరులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటూ, అందరినీ కలుపుకుంటూ ఏపీయూడబ్ల్యూజే అభివృద్ధిలో పాలు భాగస్వాములు కావాలని నూతనంగా ఎంపికైన సభ్యులకు సూచించారు.

బ్రహ్మంగారి మఠంలో ఘనంగా శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు 6వ రోజు విశేష పూజలు





(షణ్ముఖ వెలుగు, కందిమల్లాయపల్లె, అక్టోబర్ 17)

కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం, కందిమల్లాయపల్లెలోని జగద్గురు శ్రీ శ్రీ శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 6వ రోజైన శనివారం నాడు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాముల వారి దివ్య ఆశీస్సులతో జరిగిన ఈ వేడుకల్లో ఉదయం సుప్రభాత సేవతో శ్రీవారి ఆలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం ద్వార పూజ నిర్వహించారు. మూలా నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సరస్వతీ దేవి అలంకరణలో కొలువుదీరిన శ్రీ గోవిందమాంబ అమ్మవారిని మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారు దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. రాత్రివేళ భక్తులకు అల్పాహార వితరణ కార్యక్రమం చేపట్టగా, రాత్రి వేళలో కలశోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు గుంటూరుకు చెందిన కీర్తిశేషులు ఇంకొల్లు గోవిందయ్యచార్యులు వారి దత్త పుత్రుడు శ్రీధర్‌రావు ఉభయదాతలుగా వ్యవహరించారు. అలాగే తాత్కాలిక ఆధ్వర్యులుగా ఇడమకంటి జనార్ధన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి మరియు స్వామివారి కృపకు పాత్రులయ్యారని మఠం మేనేజర్ ప్రసాద్ తెలిపారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

మార్కాపురం కూటమి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 17)

మార్కాపురం పట్టణంలో మార్కాపురం మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జున నామినేషన్ కార్యక్రమం పట్టణంలోని నాయుడు బజార్ నుండి మున్సిపల్ ఆఫీసు వరకు తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల క్యాడర్‌తో కలిసి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కోలాహలంగా సాగింది. ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజవర్గ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మార్కాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు షేక్ వహీద్, మార్కాపురం నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్, మార్కాపురం జిల్లా బిజెపి అధ్యక్షులు పివి కృష్ణారావు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జున్, కూటమి మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఇప్పటికే ఈ ప్రాంత అభివృద్ధి కోసం మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశామని, వెలిగొండ ప్రాజెక్టు నీటి విడుదల చేశామని, ఇంటింటికి పైప్‌లైన్ పూర్తి చేసి త్వరలోనే నీటిని అందిస్తామని, రూ.35 కోట్లతో మార్కాపురం మున్సిపాలిటీలో సీసీ రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని, త్వరలోనే మార్కాపురం మున్సిపాలిటీలో టిట్కో ఇల్లు పంపిణీ చేయబోతున్నామని, ప్రతి నెల ఒకటో తేదీనే సామాజిక పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని, అన్నా క్యాంటీన్ ద్వారా రూ.5లకే మార్కాపురం మున్సిపాలిటీలో అల్పాహారం, భోజనం అందిస్తున్నామన్నారు. త్వరలోనే తమ శక్తి వంచన లేకుండా మార్కాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడుతామన్నారు. కూటమి అభ్యర్థులను ప్రతి ఒక్కరిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నామినేషన్ కార్యక్రమం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది. కూటమి అభ్యర్థులైన తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల కౌన్సిలర్ అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి మున్సిపల్ కార్యాలయంలో సమర్పించారు.

రెండో రోజు 88 నామినేషన్లు దాఖలు ఆర్డీఓ శివరామిరెడ్డి





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 17)

మార్కాపురం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో రెండవ రోజు నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 84 మంది కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్లు, ముగ్గురు చైర్మన్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినట్లు స్పెషల్ ఆఫీసర్, ఆర్డీవో శివరామిరెడ్డి తెలిపారు. టీడీపీ 34, వైసీపీ 36, జనసేన 11, బీజేపీ 1, సిపిఐ 2, ఇతరులు 4 వచ్చినట్లు చెప్పారు. ఆదివారం నామినేషన్ వేసే అభ్యర్థులు మధ్యాహ్నం 2.30 లోపు నామినేషన్ దాఖలు చేయాలని ఆయన తెలిపారు.

ప్రపంచ ట్రామా దినోత్సవం సందర్భంగా జీజీహెచ్ ఒంగోలులో అవగాహన కార్యక్రమం

ట్రామా రిజిస్ట్రీ నిర్వహణ

గోల్డెన్ అవర్‌లో సత్వర వైద్య సేవలు ప్రాణరక్షణకు కీలకం

సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 17)



ప్రపంచ ట్రామా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) ఒంగోలులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించడం, ట్రామా కేసుల నమోదు, గణాంకాల సేకరణ, అత్యవసర వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచడం వంటి అంశాలపై ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్, అదనపు వైద్య విద్య సంచాలకులు డాక్టర్ ఎస్ మాణిక్యరావు మాట్లాడుతూ ప్రమాద బాధితుల వివరాలను సమగ్రంగా నమోదు చేసేందుకు ట్రామా రిజిస్ట్రీ నిర్వహణ ఎంతో కీలకమని తెలిపారు. దీనివల్ల ప్రమాదాల స్వభావం, గాయాల తీవ్రత, బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను విశ్లేషించి, భవిష్యత్తులో అత్యవసర వైద్య సేవలను మరింత మెరుగుపరచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రమాద బాధితులను ఆసుపత్రికి తీసుకువచ్చిన వెంటనే వారి పరిస్థితిని అంచనా వేసి, గాయాల తీవ్రత ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో చికిత్స అందించే లిట్రయాజ్ ప్రోటోకాల్స్‌ను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా ప్రమాదం జరిగిన తొలి గంటైన గోల్డెన్ అవర్‌లో సత్వర వైద్య చికిత్స అందించడం ద్వారా ప్రాణనష్టాన్ని, తదుపరి సమస్యలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్ కిరణ్‌కుమార్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ మాధవీలత పాల్గొన్నారు. ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి డాక్టర్ మస్తాన్ బాషా కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ప్రమాద బాధితులకు సమన్వయంతో కూడిన అత్యవసర వైద్య సేవలు అందించడం, కేసుల వివరాలను పద్ధతిగా నమోదు చేయడం, సమయానుకూలంగా చికిత్స అందించడం ద్వారా రోగుల ప్రాణాలను కాపాడటంతో పాటు వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచవచ్చని వివరించారు.

టిడిపి చైర్మన్ అభ్యర్థిగా సుష్మ కేశవరెడ్డి నామినేషన్



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 17)

మాచర్ల మున్సిపల్ చైర్మన్ పదవికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా యనముల సుష్మా కేశవరెడ్డి శనివారం నామినేషన్ దాఖలు చేశారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నియోజకవర్గ ప్రజలకు సుపరిచితులైన ఎనముల కేశవరెడ్డి, సతీమణి సుష్మ కేశవరెడ్డిని చైర్మన్ అభ్యర్థిగా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో రిటర్నింగ్ అధికారికి ఆమె తన నామినేషన్ పత్రాలను అందజేశారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి తిరుగులేని మెజార్టీతో పార్టీని గెలిపించుకోవాలని ఆమె కోరారు.

ఒంగోలు సమగ్ర అభివృద్ధికి సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి


నామినేషన్లు దాఖలు చేసిన సిపిఎం అభ్యర్థులు
గంధవల్ల బాలకృష్ణ, కొక్కిలగడ్డ వంశీధర్
ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల అభ్యర్థి దామా శ్రీనివాస రావు
ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. కూటమిని ఓడించాలి
ఎస్‌కే మాబు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 17)

ఒంగోలు నగర సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఎం అభ్యర్థులు ఎన్నికల బరిలోకి దిగుతున్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు అన్నారు. నగరపాలక సంస్థ ఎన్నికల్లో మూడో డివిజన్ నుంచి కొక్కిలగడ్డ వంశీధర్, 59వ డివిజన్ నుంచి గంధవల్ల బాలకృష్ణ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య భవన్ నుంచి పీవీఆర్ బాలుర పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని ఓడించాలని మాబు పిలుపునిచ్చారు. నామినేషన్ల కార్యక్రమానికి ముందు సుందరయ్య భవన్‌లో సీపీఎం అభ్యర్థుల పరిచయ సభ నిర్వహించారు. నగర కార్యదర్శివర్గ సభ్యులు జి. రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మాబు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపే అంతిమ లక్ష్యం కాదని, ప్రజా ఉద్యమాలను బలోపేతం చేసుకునే సాధనంగా ఎన్నికలను ఉపయోగించుకోవాలని అన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసే రాజకీయాలకు భిన్నంగా ప్రజా సమస్యలే అజెండాగా సీపీఎం పోరాడుతోందని తెలిపారు. పార్టీ విధానాలను ప్రజల్లోకి



తీసుకెళ్లి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు.

డబ్బు ప్రభావానికి భిన్నంగా ప్రజా సమస్యలే అజెండా.....

ఎన్నికల్లో డబ్బు, ఆర్భాటాల ప్రభావం పెరుగుతున్నప్పటికీ ప్రజల హక్కుల కోసం పోరాడే రాజకీయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మాబు కోరారు. ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు పదవులకే పరిమితం కాకుండా ప్రజా ఉద్యమాలకు అండగా నిలవాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలపై భారాలు మోపుతున్న కూటమి పార్టీల విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని ఓడించడమే తమ ప్రధాన లక్ష్యమని మాబు స్పష్టం చేశారు. ఒంగోలులో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నిర్మించుకున్న ఉద్యమ వారసత్వాన్ని కాపాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.


పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ఏది?

సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుమారు 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఒంగోలు మున్సిపాలిటీకి కార్పొరేషన్ హోదా లభించి 14 ఏళ్లు గడిచినా, నగర అభివృద్ధి ప్రజల పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా జరగలేదని విమర్శించారు. 62 డివిజన్లు, సుమారు 1.92 లక్షల మంది ఓటర్లు ఉన్న నగరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ అవసరమన్నారు. నగర ప్రజలు ఎదుర్కొంటున్న



సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి స్పష్టమైన ఎజెండాతో సీపీఎం ఎన్నికల్లో పోటీ చేస్తోందని తెలిపారు. ఈ అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. డబ్బు, ప్రలోభాలకు లొంగకుండా ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడే అభ్యర్థులకు మద్దతివ్వాలని ఓటర్లను కోరారు. మంగమ్మ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎవి పుల్లారావు, అభ్యర్థులు గంధవల్ల బాలకృష్ణ, కొక్కిలగడ్డ వంశీధర్, 43వ డివిజన్‌లో సీపీఎం బలపరిచిన ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాల అభ్యర్థి దామా శ్రీనివాసరావు మాట్లాడారు. సిపిఎం అభ్యర్థులు బాలకృష్ణ పివిఆర్ బాలుర పాఠశాలలో, వంశీధర్ డిఆర్ఆర్ఎం పాఠశాలలో నామినేషన్ వేశారు. కాగా ఉపాధ్యాయ, ఉద్యోగ కార్మిక సంఘాలు బలపరిచిన అభ్యర్థి దామా శ్రీనివాసరావు (43 వ డివిజన్)కూడా పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం రమేష్, జిల్లా కమిటీ సభ్యులు వి బాలకోటయ్య, కంకణాల రమాదేవి, పి కల్పన, నాయకులు తంబి శ్రీనివాసులు, ఎన్ వీరాస్వామి, టి మహేష్, జి శేషయ్య, డి వీరాంజనేయులు, సిహెచ్ లక్ష్మీనారాయణ, టి భక్తసింగ్ రాజు, సిహెచ్ వినోద్, కె శ్రీనివాసరావు, జి శ్రీనివాసులు, జి రాజ్యలక్ష్మి, కె రాజేశ్వరి, బి ముసలారెడ్డి, సిహెచ్ రాంబాబు, జి నర్సయ్య, ధారా వెంకటేశ్వర్లు, షేక్ సిద్దయ్య ఎస్‌కె హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, అక్టోబర్ 17)

లింగసముద్రం మండలం విశ్వనాధపురం గ్రామ టిడిపి నాయకుడు బొల్లినేని నాగేశ్వరరావు సోదరుడు సుబ్బారావు కుమారుడు ఫణిధర్ విష్ణువర్ధన్, దీపిక నిశ్చితార్థ వేడుక కందుకూరు పట్టణంలోని కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెం మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, టిడిపి నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, వంకాయలపాటి మాల్యాద్రి, ఉన్నం వీరాస్వామి, కొచ్చర్ల శ్రీను, గుర్రం వెంకట్రావు, అల్లూరయ్య, తదితరులు హాజరైన కాబోయే వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.


నూతనంగా బాధ్యతలు చేపట్టిన మాచర్ల రూరల్ ఎస్ఐ కి ఘనంగా సత్కరించిన ప్రజా సంఘాల నాయకులు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 17)

ఇటీవల మాచర్ల రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వి వెంకటేశ్వరరావును శనివారం రూరల్ పోలీస్ స్టేషన్లో ప్రజాసంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలవాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్, దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ మాచర్ల రూరల్ పోలీస్ స్టేషన్ కు ఎస్ఐగా వి వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టటం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల రూరల్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజలకు పోలీసులకు మధ్య స్నేహపూరక సంబంధాలు ఉండే విధంగా చూడాలని, ఎస్సీ, ఎస్టీల పై దాడులు, అత్యాచారాలు జరిగినప్పుడు రిపోర్టు ఇచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్ అయ్యేలా చూడాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు నివసించే ప్రాంతంలో యువత చెడు వ్యసనాలకు లోనవుతున్నారన్నారు. వారు అసాంఘిక కార్యక్రమాలకు ఆకర్షితులవుతున్నారని, అందుచేత పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అటువంటి ప్రాంతంలో చట్టాల పట్ల అవగాహన కలిగే విధంగా యువతను చైతన్య పరిచే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ప్రతి నెల చివరి వారంలో గ్రామాలలో నిర్వహించే పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమంలో పోలీసు వారు హాజరయ్యే విధంగా చూడాలని సమస్యలను పరిష్కరించాలని ఆయనను కోరారు. సమస్యల పట్ల ఎస్ఐ వెంకటేశ్వరరావు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారని ప్రసాద్ తెలిపారు. ఎస్ఐ వెంకటేశ్వరావును సత్కరించి అభినందనలు తెలియజేసిన వారిలో దళిత బహుజన భీమ్సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి, శ్రీ వీరబ్రహ్మేంద్ర జాతీయ ప్రజా హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గురజాల అప్పారావు, బిసి నవ చైతన్య వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు బొడ్డుపల్లి ఈశ్వరయ్య, మాచర్ల నియోజకవర్గ అధ్యక్షులు గారే చిన్న మల్లయ్య, తదితరులు ఉన్నారు.

నేడు వైఎస్ఆర్సిపి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా చెప్పల్లి కనక దుర్గ నామినేషన్



వైఎస్ఆర్సిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జి అన్నా రాంబాబు ఆధ్వర్యంలో
నామినేషన్ దాఖలు చేయనున్న చెప్పల్లి కనకదుర్గ

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 17)

మార్కాపురం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల నేపథ్యంలో వైయస్సార్‌సిపి పార్టీ చైర్‌పర్సన్ అభ్యర్థి డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆశీస్సులతో ఆదివారం ఉదయం 11 గంటలకు మార్కాపురం మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. కావున ఉదయం నుంచి మార్కాపురంలోని తన స్వగృహం అయిన శ్రావణి హాస్పిటల్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ వేయడం జరుగుతుందని వైసీపీ కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

(షణ్ముఖ వెలుగు, వలేటివారిపాలెం, అక్టోబర్ 17)

మండలంలో మాలకొండ పై వెలసిన శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం ఉదయం దర్శించుకున్నారు. వర్షాలు కురిసి, నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు.






నృసింహుడి సేవలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు





అంతకు ముందు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం లభించింది. దర్శనం అనంతరం కొండ పై సౌకర్యాలు, వసతులు గురించి ఎమ్మెల్యే నాగేశ్వరరావు భక్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. అన్న ప్రసాదం తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే కొండ పై జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ప్రత్యక్షంగా చూశారు. మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నేతలు ప్రగడ శ్రీనివాసులు, కామినేని అశోక్, శనివారపు మాల్యాద్రి, ప్రగడ మోహన్, కూడలి భాస్కర్, తదితరులు ఎమ్మెల్యేతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

కూటమి అభ్యర్థుల నామినేషన్ పత్రాలు అందజేసి నామినేషన్‌లు వేసేందుకు పంపించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 17)
నగరపాలక సంస్థకు జరుగుతున్న ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. రెండోవ రోజు నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సందడి ప్రారంభమైంది. తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థులుగా నామినేషన్ వేసేందుకు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు తీసుకొని పార్టీ కార్యాలయం నుండి బయలుదేరుతున్నారు. 53వ డివిజన్ నుంచి వీరయ్య, 13 డివిజన్ నుంచి దాసరి నరేష్, 45వ డివిజన్ నుంచి మేడికొండ మోహన్, 44వ డివిజన్ నుంచి పోకూరు అనూష, 56వ డివిజన్ నుంచి ఏలూరు రజిని, వరలక్ష్మి, తదితరులు వేసేందుకు స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ నుంచి దరఖాస్తులు తీసుకొని బయలుదేరారు. దీంతో పార్టీ ఆఫీసులో సందడి వాతావరణం నెలకొంది. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ కూటమి అభ్యర్థులు నామినేషన్ వేసే పత్రాలు ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకుని మరీ నామినేషన్ వేయాలని సూచించారు.









మైదుకూరు అమ్మవారిశాలలో వైభవంగా సరస్వతీదేవి అలంకారం

ఏడవ రోజు సరస్వతీదేవి రూపంలో దర్శనమిచ్చిన వాసవీమాత
అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, అక్టోబర్ 17)
మైదుకూరు పట్టణంలోని అమ్మవారి శాలలో నిర్వహిస్తున్న శ్రీ వాసవీమాత శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన శనివారం వాసవీమాత సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జ్ఞానానికి, విద్యకు, విజ్ఞానానికి ప్రతీకగా నిలిచే సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి శాలను వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలు, ఆకర్షణీయమైన అలంకరణలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ వాసవీమాతకు వివిధ రూపాల్లో అలంకరణలు నిర్వహిస్తుండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందుతున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సందడి, ఆధ్యాత్మిక వాతావరణం మధ్య అమ్మవారిశాలలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.

అద్దంకిలో చైర్మన్ అభ్యర్థుల నామినేషన్లు ఎన్నికల సందడి షురూ



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, అక్టోబర్ 17)
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అద్దంకిలో రాజకీయ సందడి మొదలైంది. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులుగా టీడీపీ తరఫున కాకాని అశోక్, వైసీపీ తరఫున సురేష్ శనివారం నామినేషన్లు దాఖలు చేశారు. ఇరు పార్టీల అభ్యర్థులు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీలుగా వెళ్లి నామినేషన్లు సమర్పించారు. టీడీపీ అభ్యర్థి కాకాని అశోక్ ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గెలుపు తమదేనన్న ధీమాతో టీడీపీ శ్రేణులు ఉత్సాహంగా ముందుకు సాగాయి. మరోవైపు వైసీపీ అభ్యర్థి సురేష్, పార్టీ ఇన్‌ఛార్జి అశోక్ కుమార్‌తో కలిసి నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు. వైసీపీ శ్రేణులు సైతం విజయంపై ధీమా వ్యక్తం చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.ఇరు పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో అద్దంకిలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. చైర్మన్ అభ్యర్థులతో పాటు కౌన్సిలర్ అభ్యర్థులు సైతం ప్రచారానికి సిద్ధమవుతున్నారు. రానున్న రోజుల్లో ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుంది. ఇరు పార్టీల నేతలు గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తుండగా, అద్దంకి మున్సిపల్ పీఠం ఎవరిని వరిస్తుందన్న దానిపై పట్టణ ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

మార్కాపురం మున్సిపల్ ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ కనకదుర్గ

దాక్టర్ కనకదుర్గ తరఫున నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన
మార్కాపురం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి,
మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు
ఎన్నికల రిటర్నింగ్ అధికారికి
నామినేషన్ పత్రాలు సమర్పణ
మార్కాపురం మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం
చేసుకునే దిశగా
వైఎస్సార్‌సీపీ ఎన్నికల కార్యాచరణ



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 17)
మార్కాపురం మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థి డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ తరఫున పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పత్రాలను సమర్పించారు. మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకునే లక్ష్యంతో ఎన్నికల కార్యాచరణను కొనసాగిస్తోందన్నారు. ఆయనతో పాటు వైఎస్ఆర్సిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలులో ఎక్సైజ్ అధికారుల నిఘా కంభంలో పార్సెల్ సర్వీసుల తనిఖీలు

బేస్తవారిపేటలో ఇద్దరు పాత నిందితుల బైండోవర్

(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 17)
ఎన్నికల నియమావళి అమలులో భాగంగా అక్రమ మద్యం, నగదు, ఇతర నిషేధిత వస్తువుల రవాణాను అరికట్టేందుకు కంభం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తనిఖీలు, ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. కంభం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కొండారెడ్డి ఆధ్వర్యంలో కంభం పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పార్సెల్, కొరియర్ సర్వీసు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పార్సెల్ బుకింగ్ సమయంలో పంపేవారి గుర్తింపు పత్రాలు, ఫోన్ నంబర్ల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనుమానాస్పద పార్సెల్స్ గుర్తిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. అదే విధంగా బెస్తవారిపేట మండల పరిధిలో గతంలో నమోదైన ఎక్సైజ్ కేసుల్లో నిందితులుగా ఉన్న ఇద్దరు పాత ముద్దాయిలను బెస్తవారిపేట తహశీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చర్యలు చేపట్టారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు తనిఖీలు, నిఘా నిరంతరం కొనసాగుతాయని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కొండారెడ్డి హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించినా, అక్రమ మద్యం రవాణాకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.





జనసేన పార్టీ నాయకులు వైసీపీలో చేరిక



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 17)
ఒంగోలు నగరంలో ఉన్న 35 వ డివిజన్ నుంచి జనసేన పార్టీకి చెందిన డివిజన్ అధ్యక్షులు పసుపులేటి మురళి కృష్ణ (నాయుడు), ఆయన అనుచరులు 50 మంది ఒంగోలు అసెంబ్లీ ఇంచార్జ్ చుండూరి రవి బాబు సమక్షంలో వైఎస్ఆర్‌సిపి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు కటారి శంకర్, ఒంగోలు నగర మేయర్ అభ్యర్థి కుప్పం ప్రసాద్, బత్తుల బ్రహ్మానందరెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

స్టేషన్ రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి

జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 17)
స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ, కేసులకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా పోలీసులకు సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం ఆయన మార్కాపురం పట్టణంలో పట్టణ, రూరల్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల నమోదు, సంబంధిత సమాచారం నమోదు చేస్తున్న తీరు పై ఎస్ఐలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ తనిఖీలో మార్కాపురం డీఎస్పీ నిమ్మగడ్డ సత్యనారాయణ, మార్కాపురం సీఐ ఎండి ఖాజా అల్తాఫ్ హుస్సేన్, పట్టణ ఎస్ఐ పి విశ్వనాధరెడ్డి, రూరల్ ఎస్ఐ వి వేమన, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.









కరెన్సీ నోట్ల అలంకారంలో కనువిందు చేసిన శ్రీ వాసవి అమ్మవారు

శ్రీ మహాలక్ష్మి అలంకరణతో శోభిల్లిన అమ్మవారు
అమ్మవారికి కనకాభిషేకం నిర్వహించిన ఆలయ ధర్మ కర్తలు, భక్తులు
అష్టలక్ష్మిలుగా కొలువు తీరిన అమ్మవారు

(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, అక్టోబర్ 17)
దసరా శ్రీ దేవి నవరాత్రులు సందర్భంగా చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో అమ్మవారి విశేష పూజా కార్యక్రమాలు 7వ రోజు శనివారం నిత్య పూజలు, అలంకారాలతో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శనివారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి తల్లిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవి శరన్నవరాత్రులు సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలసి క్షేత్రంలో కొలువై ఉన్న సకల దేవతలకు విశేష పూజలు నిర్వహించారు.

ధన లక్ష్మి దేవిగా వాసవి అమ్మవారు

ఆలయ ధర్మ కర్తలు ఆధ్వర్యంలో రూ. 5,00,000 నోట్లతో అలంకరించిన శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవిని, పార్వతి దేవి అమ్మవారిని శిద్దా రాఘవరావు దంపతులు విశేష పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. కనకాభిషేకంతో కనువిందు చేసిన అమ్మవారు. విశేషపూజలు అనంతరం ఆలయ ధర్మ కర్తలు శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా పాండురంగరావు దంపతులు, భక్తులు అమ్మవారికి కనకాభిషేకం మరియు ధనంతో అభిషేకం వైభవంగా నిర్వహించారు. శనివారం ప్రాతకాలంలో శ్రీ వాసవి అమ్మవారికి విశేష పూజలు, పంచామృత సుగంధ ద్రవ్యాలు అభిషేకాలు, శ్రీ చక్రార్చన, ఉభయదాతలతో వాసవి మహిళలచే సామూహిక లలితా సహస్ర నామ పారాయణం చేశారు. శ్రీ నగరేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేక పూజా కార్యక్రమం, శ్రీ చక్రార్చన నవావరణ పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులకు హారతి, తీర్థప్రసాదాలు అందజేశారు. శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. దసరా శరన్నవరాత్రులు సందర్భంగా శ్రీ హరిహర క్షేతం విద్యుత్ దీపాలతో, వివిధ పుష్పాలతో అలంకరించారు. ఆదివారం అమ్మవారు శ్రీ కనక దుర్గ అలంకరణతో భక్తులకు దర్శన భాగ్యంతో పాటుగా వన దుర్గ తల్లిగా షోడశ హరతులతో భక్తులకు ఆశీస్సులు అందిస్తారని శిద్దా లక్ష్మి పద్మావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో శిద్దా పాండురంగారావు దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా సాయి బాబా దంపతులు, శిద్దా శ్రీనివాసరావు, లలిత దంపతులు, కొణిజేటి సువర్ణ, గాదంశెట్టి లక్ష్మి, చలువాది మాధవి, కూరపాటి ధనలక్ష్మి, దాట్ల సువర్చల, ఏ అరుణ, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






విజయదుర్గాదేవి ఆలయంలో దామచర్ల నాగసత్యలత ప్రత్యేక పూజలు

మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 17)
దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఒంగోలు నగరంలోని కేశవస్వామిపేటలో వేంచేసి ఉన్న శ్రీ విజయదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో ఒంగోలు నియోజకవర్గ శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు సతీమణి నాగసత్యలత ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో ప్రత్యేకంగా అలంకరించారు. మహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని నాగసత్యలత దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూము సుబ్బారావు, పాలపర్తి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరిలో 18న రాయప్రోలు జగదీశ చంద్రశర్మచే ఆధ్యాత్మిక ప్రసంగం

19న ఊంజల సేవ.. భక్తి సంగీత విభావరి
20న తిరు వీధి ఉత్సవం.. కోలాట ప్రదర్శన
శ్రీ గిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 17)
ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 18 నుండి 20వ తేదీ వరకు విశేష కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు వెల్లడించారు. కార్యక్రమాలలో భాగంగా 18వ తేదీ ఆదివారం ఉదయం శ్రీవారికి తోమాల సేవ, తులసి దళాలతో సహస్రనామార్చన, సాయంత్రం ఏడు గంటలకు హనుమంతు వాహన సేవ, తెనాలికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు విశ్రాంత తెలుగు అధ్యాపకులు 'కవి వతంస' రాయప్రోలు జగదీశ చంద్రశర్మచే ఆధ్యాత్మిక ఉపన్యాసం జరుగుతాయి. 19వ తేదీ సోమవారం సాయంత్రం ఏడు గంటలకు శ్రీవారికి ఊంజల సేవ, శ్రీ గిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు వివిఎస్ వినోద్ కుమార్ చే భక్తి సంగీత విభావరి జరుగుతాయి. 20వ తేదీ మంగళవారం సాయంత్రం 6:30 గంటలకు శ్రీవారి తిరు వీధి ఉత్సవం, ద్వారకాపాడుకు చెందిన అత్తిన బాల కోటేశ్వరరావు బృందంచే కోలాట ప్రదర్శన జరుగుతాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కోరారు.




రసవత్తరంగా ఒంగోలు మేయర్ పీఠం కోసం పోటీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 17)
రెండో రోజు నామినేషన్లలో భాగంగా మేయర్ పదవికి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఒంగోలు ఆర్డీఓ చంద్రశేఖర నాయుడుకు అందజేశారు. మేయర్ పదవికి వైసీపీ తరపున కుప్పం ప్రసాద్ భార్య ప్రసన్న రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మరో ఇద్దరు అభ్యర్థులు ఇండిపెండెంట్లుగా నామినేషన్లు వేశారు. ఇక కార్పొరేటర్ స్థానాలకు మాత్రం నామినేషన్ల వరద కనిపించింది. తమకు కేటాయించిన కేంద్రాల్లో అభ్యర్థులు రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలను అందజేశారు. రెండో రోజు మొత్తం 101 కార్పొరేటర్ నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే రెండో రోజు భారీ సంఖ్యలో నామినేషన్లు వెల్లువెత్తుతాయని అధికారులు అంచనా వేశారు. దీంతో నామినేషన్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత, పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కానీ టీడీపీ, జనసేన, వైసీపీ వంటి ప్రధాన రాజకీయ పార్టీల నుంచి అభ్యర్థుల ఎంపిక పూర్తిస్థాయిలో కొలిక్కి రాకపోవడంతో ఊహించిన స్థాయిలో నామినేషన్లు దాఖలు కాలేదు. ఇప్పుడు అందరి చూపు చివరి రోజు ఆదివారం పైనే. టికెట్లు ఖరారు కావడం, అభ్యర్థులు బరిలోకి దిగడం, నామినేషన్ల దాఖలుకు సమయం ముగియనుండటంతో ఒంగోలు రాజకీయ సమరంలో అసలు సీన్ రేపే కనిపించనుంది. నామినేషన్ కేంద్రాల వద్ద ఎటువంటి ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. నామినేషన్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు నేతృత్వంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు చేపట్టారు.





పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గృహనిర్బంధం పోలీస్ బందోబస్తు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 17)
మాచర్ల మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి శనివారం నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా వైసిపి పలనాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని తన నివాసంలో గృహనిర్బంధం చేసి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయన ఇంటి నుంచి బయటకు రాకుండా పోలీసుల నియంత్రణ చర్యలు చేపట్టారు .మరోవైపు పట్టణంలోని అన్ని వార్డుల నుంచి వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, అక్టోబర్ 17)
దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కందుకూరులోని పెద్దబజారులో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం చైర్మన్ కోట వెంకట నరసింహం, ఏఎంసి డైరెక్టర్ కొత్తూరు వెంకట సుధాకర్, ఆర్యవైశ్య నాయకులు మురారిశెట్టి శ్రీకాంత్, గుర్రం అల్లూరయ్య, చిన అల్లూరయ్య, గుర్రం వెంకటరావు, చెక్కా కేశవరావు తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.




మార్కాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 17)
మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా శనివారం మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసి, కేసుల నమోదు, సంబంధిత సమాచారం నమోదు చేస్తున్న తీరుపై ఎస్ఐను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com